క్లుప్తంగా

బాధితులకు సాయం

భట్లపెనుమర్రు(మొవ్వ): ఈ నెల 13వ తేదీన మొవ్వ మండలం భట్లపెనుమర్రులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నడగల శ్రీనివాసరావు కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ, ఎంపీపీ కొండేటి ఇందిర తదితరులు బుధవారం సాయం అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వంట, వడ్డన సామగ్రి, హైజనిక్, కాస్మొటిక్ కిట్లులు, దుస్తులు తదితరాలను అందజేశారు. తహసీల్దార్ డెక్కా వీరాంజనేయులు బియ్యం, నిత్యవసరాలను, రూ.6 వేల నగదు, ఎంపీపీ కొండేటి ఇందిర చందు రూ.5 వేల నగదు, నన్నపనేని వీరేంద్ర రూ.10 వేలు, శ్రీ సత్యసాయి సేవా సమితి రూ.5 వేలు, జన్మభూమి సేవాసమితి అధ్యక్షుడు నన్నపనేని స్వర్ణలత రూ.5 వేలు, గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర రూ.2 వేల నగదు, సంజీవిని వైద్యాలయం రూ.2 వేల నగదు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కోనేరు రాజేంద్రప్రసాద్, గొరిపర్తి వెంకట రమణ, దోనేపూడి శివరామయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య

కైకలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, కృష్ణకుమారి చెప్పారు. జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కైకలూరు, కలిదిండి మండల అంగన్‌వాడీ కేంద్రాల్లో ర్యాలీలు, తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రీస్కూల్ కిట్ సామగ్రిని తల్లులకు అందజేశారు. వెలంపేట కాలనీ 16వ వార్డు, కైకలూరు 4, 6, 7 వార్డులు, దొడ్డిపట్ల ఇలా అనేక సెంటర్లలో కార్యక్రమం జరిగింది.

ఆణిముత్యాలు..నవరత్నాలు

- పామర్రు నియోజకవర్గంలో తొమ్మిది మంది ఆణిముత్యాలు
- పదో తరగతిలో ఐదుగురికి, ఇంటర్మీడియెట్‌లో నలుగురు
- నేడు నిమ్మకూరులో సర్టిఫికెట్లు, మెడల్స్‌తో సత్కారం



త్రివేణి, నియోజకవర్గంలో ప్రథమం (586) | వి.చాందిని, నియోజకవర్గంలో ద్వితీయ (581) | మాదాసి ఈక్షిత, నియోజకవర్గంలో ద్వితీయ (581) | మిక్కిలి చరిష్మా, నియోజకవర్గంలో తృతీయ (576) | దావల్య మేఘశ్రీ, నియోజకవర్గంలో తృతీయ (576)

పామర్రు: ప్రభుత్వ విద్యారంగంలో నూతన ఒరవడి మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ప్రతిభావంతులను సత్కరించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గడిచిన విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద సన్మానించి నగదు బహుమతులు ఇవ్వనున్నారు. పామర్రు నియోజకర్గ స్థాయిలో పామర్రు మండల నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల పాఠశాల ఆవరణలో ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించనున్నారు. పామర్రు నియోజకవర్గ స్థాయిలోని ఐదు మండలాల్లో పామర్రు మండలానికే జగనన్న ఆణిముత్యాలు దక్కాయి. మండల పరిధిలో ఒకరికి ప్రథమం, ఇద్దరికి ద్వితీయ, ఇద్దరికి తృతీయ స్థానాలు వచ్చాయి. పామర్రు మండలంలోని నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన వల్లూరి త్రివేణి (586)మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే పాఠశాలకు చెందిన విశ్వనాథపల్లి ఛాందిని, మాదాసి ఈక్షితలు (581)మార్కులు సాధించి ద్వితీయస్థానాల్లో నిలిచారు. మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మిక్కిలి చరిష్మా, ఏపీ గురుకుల పాఠశాల నిమ్మకూరు విద్యార్థిని పామర్తి ధావల్య మేఘశ్రీ (576) మార్కులతో తృతీయస్థానంలో పొందారు.

నగదు ప్రోత్సాహం..

నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.10 వేలు, తృతీయస్థానం సాధించిన విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను అదించనున్నారు.

జూనియర్ కళాశాల స్థాయిలో..

పామర్రు నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిలోని నాలుగు గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాల కింద ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నారు. ఈనెల 15వ తేదీన ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగు గ్రూపుల్లో నలుగురు..

నియోజకవర్గ స్థాయి నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల కళాశాల, మొవ్వ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన నలుగురు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. నిమ్మకూరులోని ఏపీ ఆర్‌జేసీకి చెందిన డి. అంజిరెడ్డి ఎంపీసీ గ్రూపులో 1000–968 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించారు, ఇదే కాలేజీలో బైపీసీలో విద్యార్థి ఎస్.శివారెడ్డి 1000–971 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో పొందాడు. హెచ్ఈసీ గ్రూపులో మొవ్వ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం. తేజస్విని 1000 మార్కులకు 674 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో, సీఈసీ గ్రూపులో ఇదే కాలేజీ విద్యార్థి కె.రాజబాబు 1000 మార్కులకు 914 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందింది. వీరికి ఒకొక్కరికి ప్రభుత్వం నుంచి రూ.15 వేలు నగదు ప్రొత్సాహకాలను ఈనెల 15వ తేదీన అందజేయనున్నారు.

నిమ్మకూరు వేదికగా..

ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుతూ జగనన్న ఆణిముత్యాల కింద పామర్రు నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు గురువారం సన్మానం నిర్వహించనున్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహక నగదు కూడా అందజేస్తారు. పామర్రు మండలం నిమ్మకూరు గ్రాంమలోని ఏపీ గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. ముఖ్యఅతిథులుగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, డీఈవో తాహెరా సుల్తానా, పామర్రు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్‌కుమార్, తహసీల్దార్ వీవీ భరత్ రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ హాజరవుతారని ఎంఈవో విజయలక్ష్మి తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గుర్తించి జగనన్న ఆణిముత్యాలుగా ప్రకటించి ప్రోత్సాహక నగదు ఇవ్వడం అభినందనీయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎంతో మంచిది. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీలలో మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి.

–పీ విజయలక్ష్మి, ఎంఈవో, పామర్రు

విద్యా కానుకలతో విద్యార్థుల్లో ఆనందం



ముదినేపల్లిలో జగనన్న విద్యాకానుక కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: జగనన్న విద్యాకానుక కిట్స్‌తో విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండవల్లి, ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఎమ్మెల్యే డీఎన్నార్ విద్యార్థులకు విద్యా కానుక కిట్స్ పంపిణీ చేశారు. కుట్టుకూలితో సహా మూడు జతల యూనిఫామ్, బ్యాగ్, టెక్ట్స్ బుక్స్, నోట్‌బుక్స్, వర్క్ బుక్స్, బూట్లు, రెండు జతల సాక్స్, బెల్ట్‌తో పాటు మినీ డిక్షనరీని విద్యార్థులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో రూ.60 వేల 329 కోట్లు విద్యారంగానికి ఖర్చు చేశారన్నారు.ఒక్కో విద్యార్థికి రూ.2,400 ఖర్చు పెడుతోందన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డిశ్రీరామదుర్గాప్రసాద్,జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, సర్పంచ్ మెండా ఝూ న్సీ, బి.యేసోబు రాజు, చేబోయిన వీర్రాజు, మెండా సురేష్,హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, ముదినేపల్లి హైస్కూల్‌లో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ ఆర్ రాధా, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ మరీదు నాగయ్య, ఎం.ఏసుబా బు, అధ్యక్షుడు శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

పిల్లల చదువులకు సహకరించాలి

గుడివాడరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతూ ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల చదువులకు తల్లిదండ్రులు సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎ.విజయఫ్లోరెన్స్ అన్నారు. మండల పరిధిలోని బిళ్లపాడు పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివి ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను బుధవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లల శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందేందుకు చిరుప్రాయం నుంచే చదువుల్లో ప్రోత్సహించాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం పిల్లలకు పౌష్టికాహారం అందించడమే కాకుండా చదువుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యను అంగన్‌వాడీల్లో ప్రవేశ పెట్టి వారికి చదువులపై శ్రద్ధ చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.అరుణకుమారి, నాగజ్యోతి, ఎంఎస్‌కే రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ



శ్రీ విద్య | గోవర్ధన

మొవ్వ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలు బుధవారం రాత్రి వెలువడిన నేపథ్యంలో మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సీఈసీ, ఎంపీసీ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. గ్రామీణ ప్రాంతమైన మొవ్వ జూనియర్ కళాశాల నెలకొల్పి 43 సంవత్సరాల చరిత్రలో ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు 460 మార్కులు, సీఈసీ గ్రూపులో 500 మార్కులకు 453 మార్కులు సాధించి మొదటి సంవత్సర ఫలితాల్లో కే శ్రీవిద్య, గోవర్ధన అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులుగా రికార్డు సృష్టించారు. విద్యార్థులను గురువారం పలువురు విద్యార్థినులను అభినందించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే డీఎన్నార్



భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డీఎన్నార్, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు

కైకలూరు: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనునిత్యం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలసి రూ.13.75 లక్షలతో పునర్నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో రూ.392.03 కోట్లతో పీఏసీఎస్ నూతన భవనాలు, మరమ్మతులు, గోడౌన్లు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో జగనన్న గ్రీన్ విలేజ్ లబ్ధిదారులకు రూ.2 లక్షల వ్యక్తిగత రుణం అందించడానికి ముందుకొచ్చిన కేడీసీసీ బ్యాంకు సహకారాన్ని అభినందించారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని అన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, బ్యాంకు డైరెక్టర్ పడమటి సుజాత, సీఈఓ శ్యామ్ మనోహర్, జీఎం చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ కనక దుర్గారాణి, సర్పంచ్ మసిముక్కుల మారుతి ప్రసన్న, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఉరా కల్యాణి పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిర నిర్మాణానికి శంకుస్థాపన

కైకలూరు: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణం చేపట్టనున్న రాధాకృష్ణ మందిర పనులకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణ, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, చేబోయిన వీర్రాజు, జంపన రామలింగరాజు, పంజా రామారావు, బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

పామర్రు: మండల పరిధిలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నాటికి మొత్తం పంపిణీని పూర్తి చేయాలని అన్నారు. ఉచితంగా ఒక్కొక్కరికి ఐదు కేజీల బియ్యం, పంచదార అరకేజీ రూ.17.50, కేజీ కందిపప్పు రూ.67 వంతున అందిస్తున్నామని తెలిపారు. ఈ ధరకు మించి అదనంగా వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని కోరారు.

సీఎం జగన్ పర్యటన పోస్టర్ల ఆవిష్కరణ

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన టిడ్కో గృహాలను ప్రారంభించేందుకు గుడివాడ మండలం మల్లాయపాలెం వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను దిగ్విజయం చేయాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. సీఎం పర్యటన పోస్టర్లను ఆవిష్కరించారు. మండల గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్‌లతో కలసి విస్తృతంగా బుధవారం పర్యటించారు. ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) గృహాల నిర్మాణాలు పూర్తి కావడానికి మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కృషి చేయడం హర్షణీయమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు విక్టర్ మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె రాము, అంగడాల వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు అంగడాల శ్రీరామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.